స్పందన అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి

జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి

వినతులు స్వీకరిస్తున్న డిఆర్ఒ

భీమవరం:స్పందనలో వచ్చిన ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. డిఆర్ఒతోపాటు డిపిఒ జివికె.మల్లి కార్జునరావు, డిఎల్డిఒ కెసిహెచ్.అప్పారావు, డిఎస్పి బి.శ్రీనాథ్ హాజరై ప్రజల నుండి 252 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ కృష్ణవేణి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ చేయాలన్నారు.

తగ్గని గోదావరి ఉధృతి

లంకవాసుల బేజారు - నామమాత్రంగానే ప్రభుత్వ సాయం

ప్రజాశక్తి - ఆచంట

లంక గ్రామాల్లో వరద ఉధతి సోమవారం మరింత పెరిగింది. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ముందు జాగ్రత్తగా కోడేరులో రెండు ఇంజిన్ పడవలను సిద్ధం చేశారు. ఆనగార్లలంక, కోడేరు పల్లిపాలెం, అయోధ్యలంక గ్రామాల్లోకి వరద నీరు చేరింది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి వీల్లేని దుస్థితి నెలకొంది. అయోధ్యలంకలో నాలుగు అడుగుల మేర నీరు నిలిచిపోయింది. ఆనగార్లలంకలోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. బాహ్య ప్రపంచంతో లంక వాసులకు సంబంధాలు తెగిపోవడంతో నిత్యావసర వస్తువుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. పశువులను ఎత్తైన ప్రాంతాలకు తరలించినా పశు గ్రాసం కోసం కూడా ఇబ్బందులు తప్పడం లేదని రైతులు చెబుతున్నారు.

ఆచంట మండలంలో గోదావరి ఉధృతి

యలమంచిలి మండలంలో పడవలపై రాకపోకలు

అంధకారంలో లంక గ్రామాలు

ఆనగార్లంక, పెదమల్లంలంక, అయోధ్యలంకలో రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. రాత్రయిందంటే చాలు కాలు కింద పెట్టలేని దుస్థితి లంక వాసులది. వరద ప్రవాహానికి పాములు వస్తున్నాయని వారు భయపడుతున్నారు. వరద ఉధృతి తగ్గితేగాని విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేమని అధికారులు చెబుతున్నారు. పెద్దమల్లంలోని మాచేనమ్మ ఆలయం వరద నీటిలో మరింత మునిగింది. ఆలయ ప్రాంగణం వద్ద నాలుగు అడుగుల మేర నీరు నిలిచింది. వరద బాధితులకు ఆయా గ్రామాల్లో 12 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్ తెలిపారు. తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపిడిఒ జగన్నాధరావు, ఎస్ఐ రాజ్‌కుమార్ వరద పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

యలమంచిలి: గోదావరి వరద ఉగ్రరూపం సోమవారం కూడా కొనసాగింది. దీని ప్రభావంతో మండలంలోని లంక గ్రామాలైన కనకాయలంక, పెదలంక, బాడవ, యలమంచిలి లంక, లక్ష్మీపాలెం, గంగడపాలెం, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల, బూరుగుపల్లి తదితర గ్రామాల్లో జనజీవనం స్తంభించింది. ఆయా గ్రామాల్లో ప్రజలు ఎవరికైనా అనారోగ్య సమస్యలు వస్తే పడవలే దిక్కవుతున్నాయి. ఇక ఆహారం కోసం ఎదురుచూపులు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. పది రోజులుగా వరద కారణంగా కనీసం వంట చేసుకోవడానికి వీలు లేని పరిస్థితులున్నా ఇప్పటి వరకు లంక గ్రామాల ప్రజలకు ప్రభుత్వం తరపున ఏఒక్కరికీ భోజన వసతిగాని, చిన్న పిల్లలు, బాలింతలకు కనీసం పాల ప్యాకెట్ కూడా పంపిణీ చేయలేదని వాపోతున్నారు.

ఇల్లు పూర్తిగా మునిగినా పట్టించుకోవడం లేదు

గాడ దుర్గ, భీమలాపురం కాపులపాలెం

భీమలాపురం కాపులపాలెంలో మా ఇల్లు పూర్తిగా నీట మునిగింది. అధికారులు ఎవరూ స్పందించడం లేదు. రెండు కిలోమీటర్ల దూరంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. మేమెలా వెళ్లి రావాలి. తక్షణమే అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నాం

దాసరి జయలక్ష్మి, అయోధ్యలంక, పెదపేట

రెండు రోజులుగా బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నాం. గోదావరి ఉధృతంగా వచ్చినా అధికారులు పడవలు ఏర్పాటు చేయడం లేదు. నిత్యావసర వస్తువులు తెచ్చుకోవడానికీ అవకాశం లేదు. పునరావాస సౌకర్యం లేదుగాని భోజనం మాత్రం వండి అందిస్తున్నారు.

రెండు కిలోమీటర్ల దూరంలో భోజనాలు

మానుపాటి కనకదుర్గ, భీమలాపురం కాపులపాలెం

భీమలాపురం ఏటిగట్టు దిగువన ఉండటంతో వరదలకు మా ఇల్లు పూర్తిగా నీట మునిగింది. ఏటిగట్టుపైనే పందిరి వేసుకుని ఉంటున్నాం. అధికారులు వచ్చి వెళ్తున్నారు తప్ప సాయం ఏమీ చేయడం లేదు. అధికారులు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న జెడ్పి హైస్కూల్లో భోజనాలు ఏర్పాటు చేశారు. నడుచుకుంటూ వెళ్లి తిని రావాల్సిన దుస్థితి నెలకొంది.

గతేడాది పరిహారం ఇప్పటికీ రాలేదు

చొప్పల నాగేశ్వరరావు, అయోధ్యలంక పెదపేట

గత సంవత్సరం వచ్చిన వరదలకు మా ఇల్లు పూర్తిగా మునిగి కూలిపోయింది. అధికారులు వచ్చి రాసుకెళ్లారు. అయితే ఇప్పటి వరకూ ఎటువంటి నష్టపరహారమూ రాలేదు. తక్షణమే అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలి. ఈ వరదలకు కూడా ఇల్లు పూర్తిగా నానిపోయింది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని దుస్థితి ఉంది.

ప్రాణాలరచేత పట్టుకుని..!

సళ్లల వెంకటేశ్వరరావు, అయోధ్యలంక, పెదపేట

నాటు పడవలపై దినదిన గండంగా రాకపోకలు సాగిస్తున్నాం. గోదావరి వరదొస్తే ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని బిక్కుబిక్కు మంటూ కాలం గడపాల్సి వస్తోంది. వారం రోజుల నుంచి పనులు లేక అల్లాడిపోతున్నాం. వరద తగ్గితేగాని మాకు పనులు ఉండవు. ప్రభుత్వం తిండి పెడుతుందిగాని సౌకర్యాలు చూపడం లేదు.

కలెక్టర్‌కూ తప్పని గోదావరి కష్టాలు

బోటు ఎక్కేందుకు కలెక్టర్ అవస్థలు

ఆచంట:గోదావరి వరదల నేపథ్యంలో పరిస్థితిని పరిశీలించేందుకు కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం మండలంలోని లంక గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా లంక గ్రామాల వాసులు రాకపోకలకు పడుతున్న ఇబ్బందులు కలెక్టర్‌కు ప్రత్యక్ష అనుభవంగా మారాయి. మండలంలోని అయోధ్యలంక పంచాయతీ పరిధిలోని పెదపేటలో వరద బాధితులను పరామర్శించడానికి వెళ్లిన కలెక్టర్ తిరుగు ప్రయాణంలో పడవ ఎక్కడానికి పడిన కష్టాలు వర్ణనాతీతం. రాయిలంక వెళ్లేందుకు పడవ దిగి ముంపునకు గురైన ప్రాంతాలకు వెళ్లడానికి సుమారు అర కిలోమీటర్ దూరం ఉండటంతో స్థానికులు స్కూటీ ఏర్పాటు చేశారు. ఆ స్కూటీపైన వైద్యఆరోగ్య శాఖకు చెందిన అనిత కలెక్టర్ ప్రశాంతిని మోటార్ సైకిల్‌పై తీసుకెళ్తుండగా పది మోటార్ సైకిల్ అదుపు తప్పింది. ఈ క్రమంలో కలెక్టర్ కిందపడబోతుండగా అధికారులు పట్టుకోవడంతో ప్రమాదం తప్పింది. అనంతరం పడవల ద్వారా మర్రిమూల నుంచి కోడేరు పుష్కరరేవుకు చేరుకోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే గోదావరి నుంచి గట్టుపైకి రావడానికి ఎక్కడా లంకల్లో రేవులు లేకపోవడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ సందర్భంగా వారు నిత్యం పడుతున్న కష్టాలే కలెక్టర్‌కు ప్రత్యక్ష అనుభవంగా మిగిలాయి. దీనిపై జిల్లా అధికారి స్పందించి లంక గ్రామాల ప్రజల కష్టాలు గట్టెక్కించడానికి ఏమైనా చర్యలు తీసుకుంటారో.. లేదో వేచిచూడాలి.

మోడీ పాలనలో వ్యవస్థలన్నీ నాశనం

చించినాడ అమరవీరుల స్మారక సభలో - సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - యలమంచిలి

చించినాడలో సభకు హాజరైన జనం

మోడీ పాలనలో దేశంలోని వ్యవస్థలన్నీ నాశనమయ్యాయని, దేశం బాగుపడాలంటే వచ్చే ఎన్నికల్లో బిజెపిని గద్దె దించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సాయంత్రం చించినాడలో అమరవీరుల 73వ స్మారక సభ ఆ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదల పొట్ట కొట్టి పెద్దలకు దోచిపెట్టే విధంగా మోడీ దుర్మార్గ పరిపాలన సాగిస్తున్నారన్నారు. మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ ప్రజల మధ్య చీలిక తీసుకొస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి పాలనలో ఉన్న మణిపూర్‌లో మహిళలపై అఘాయిత్యాలు, దారుణాలు చూసి ప్రపంచం నివ్వెరపోయిందని, అయినా మన రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేలకు ఇవేమీ పట్టకుండా బిజెపికి మద్దతు పలుకడం దారుణమన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ వృథా కావని, వారి త్యాగాల ఫలితంగానే చించినాడలో 68 సంవత్సరాల పాటు ఎర్రజెండా ఆధ్వర్యంలో పరిపాలన సాగిందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు మాట్లాడారు. తొలుత అమరవీరుల స్థూపంపై జెండాను బలరాం ఆవిష్కరించగా, అమరవీరుల చిత్రపటాలకు రాజగోపాల్, పెద్దిరాజు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో నాయకులు కేతా సూర్యారావు, బాతిరెడ్డి జార్జి, సరిపల్లి జయప్రభ, జిల్లెల్ల ప్రశాంతి, పీతల రామచంద్రరావు, మాసవరపు సుబ్బారావు, గొల్ల ఏడుకొండలు, శ్రీనివాస్, చెల్లిబోయిన వడ్డికాసులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి కర్రి సుభాషిణి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

దాట్ల వారసత్వం కొనసాగింపు అభినందనీయం

వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పెనుమంట్ర

దాట్ల స్థూపం వద్ద మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

అమరజీవి, కల్లుగీత కార్మికోద్యమ నిర్మాత ఎస్ఆర్.దాట్ల వారసత్వాన్ని కొనసాగించడం అభినందనీయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఎస్ఆర్.దాట్ల 44వ వర్ధంతి సందర్భంగా సోమవారం బ్రాహ్మణచెరువులో చింతపల్లి శ్రీరాములు స్మారక బస్టాండ్ వద్ద దాట్ల వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన బయోలాజికల్ ఈ లిమిటెడ్ వారి సహకారంతో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. తొలుత ఎస్ఆర్.దాట్ల, ఆయన సతీమణి సూర్యావతి, విజయ్‌కుమార్ దాట్ల, చింతపల్లి శ్రీరాములు చిత్రపటాలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి బలరాం, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం, పెనుమంట్ర సర్పంచి తాడిపర్తి ప్రియాంక, జెడ్‌పిటిసి సభ్యురాలు కర్రి గౌరీసుభాషిణి, మార్టేరు ఉపసర్పంచి కర్రి వేణుబాబు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కేతా పద్మజ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఆరోగ్యం అనేది చాలా ముఖ్యమైందన్నారు. ప్రస్తుతం విద్య, ఆరోగ్యం కోసమే కుటుంబం అప్పుల పాలవడం, ఆత్మహత్యలకు పాల్పడటం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. అందరికీ విద్య, వైద్యం ప్రాథమిక హక్కుగా ఉండాలన్నారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం వైద్యాన్ని ఒక వ్యాపారంగా కాకుండా సేవా కార్యక్రమం కింద నిర్వహిస్తూ ప్రపంచస్థాయిలో మన్ననలు పొందిందన్నారు. మన దేశం, రాష్ట్రంలో వాతావరణ మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధులకూ వేలాది రూపాయలు వెచ్చించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఎస్ఆర్.దాట్ల స్ఫూర్తితో ప్రతియేటా ఉచిత వైద్యశిబిరాలు పెట్టి సేవలందించడం అభినందనీయమన్నారు.

అనంతరం చింతపల్లి శ్రీరాములు స్మారక బస్టాండ్ నుండి పెనుమంట్ర ఎస్ఆర్.దాట్ల స్థూపం వరకు ప్రదర్శన నిర్వహించారు.

పెనుమంట్రలో ఎస్ఆర్.దాట్లస్థూపం వద్ద జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ అత్తిలి నియోజకవర్గంలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ఎందరో ఆదరాభిమానాలు కలిగిన నాయకుడు ఎస్ఆర్.దాట్ల అని కొనియాడారు. తొలుత దాట్ల స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కల్లుగీత కార్మికులందరినీ ఏకం చేసి సంఘాన్ని నిర్మించారని గుర్తు చేశారు. కల్లుగీత కార్మికుల హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం విశేష కృషి చేశారని కొనియాడారు. ఇప్పటికీ కల్లుగీత కార్మికులకు సరైన ఆదరణ, సరైన పథకాలు లేవన్నారు. ప్రస్తుతం కులాలవారీ, వృత్తులవారి, అనేక కార్పొరేషన్లు వచ్చాయని చెప్పారు. వృత్తులు చేసే వారికి ఎలాంటి పథకాలూ, నిధుల మంజూరుగాని లేదన్నారు. పూర్తిగా చేతివృత్తులు నిరాదరణకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అదే వృత్తిలో కొనసాగలేక, వేరే వృత్తిలో బతకలేక సతమతమవుతున్నారని అన్నారు. ఈ ప్రభుత్వం కార్పొరేషన్లు పెట్టి పదవులు ఇచ్చింది తప్ప నిధులు కరువయ్యాయన్నారు. చేతివృత్తిదారులకు సమగ్ర చట్టం తీసుకొస్తే తప్ప వృత్తుల రక్షణ సాధ్యం కాదని స్పష్టం చేశారు. మోడీ తాను బిసినని చెప్పుకుంటూ దేశంలో వెనుకబడిన తరగతులపై జరుగుతున్న అఘాయిత్యాలను అడ్డుకోవడంలో విఫలం కావడంతోపాటు మణిపూర్ మారణహోమంపై నోరు మెదపకపోవడం అత్యంత దారుణమన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్.దాట్ల ట్రస్టు సభ్యులు చిలుకూరి రాఘవరాజు, సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు, నేతలు కోడే శ్రీనివాసప్రసాద్, బత్తుల విజయ్‌కుమార్, చింతపల్లి లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

మెనూ ఛార్జీలు, వేతనాలు పెంచాలి

కలెక్టరేట్ వద్ద ధర్నాలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మదీనా, అజయకుమారి

ప్రజాశక్తి - భీమవరం

మధ్యాహ్న భోజనం కార్మికుల ఉపాధికి భద్రత కల్పించి మెనూ ఛార్జీలు, బడ్జెట్, వేతనాలు పెంచాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మదీనా, అజయకుమారి డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మదీనా, అజయకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందని విమర్శించారు. మెనూ ఛార్జీలు పెంచకుండా, బడ్జెట్ సక్రమంగా కేటాయించకుండా స్కూళ్లలో వంట ఎలా సాగుతుందని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజనాన్ని ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ మిడ్డేమీల్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వ ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు, మిడ్‌డే మీల్స్ కార్మికులకు చేస్తున్న అన్యాయాన్ని పిల్లల తల్లిదండ్రులకు తెలియజేయడానికి సిద్ధపడాలన్నారు. అనంతరం స్పందనలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.సీతామహాలక్ష్మి, రత్నకుమారి, నాగమణి, అమ్మాజీ, మరియమ్మ, సుజాత పాల్గొన్నారు.

నినదిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మణిపూర్ ఘటనలపై నిరసనల వెల్లువ

వీరవాసరంలో శాంతి ర్యాలీ

ప్రజాశక్తి - తణుకు రూరల్

మణిపూర్‌లో శాంతి భద్రతలను పరిరక్షించడంలో బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు విమర్శించారు. మణిపూర్‌లో మారణకాండను ఆపి, శాంతి నెలకొల్పాలని ఆ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం వేలూరులోని టైలర్స్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నేతలు తిరునాధం వెంకటేశ్వరరావు, వాసా వెంకటేశ్వరరావు, సోరపల్లి రామకృష్ణ, వాటాల నాగేశ్వరరావు, విశ్వనాధం సుబ్బారావు, దున్నే నాగేశ్వరరావు, యండమూరి నాగేంద్ర, వాసా పోసియ్య, కురెళ్ల అర్జున్, రుద్రాక్షుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీరవాసరం: మణిపూర్‌లో మారణహోమాన్ని నిరసిస్తూ మండల క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక పంట కాల్వ వద్ద నుండి బస్టాండ్ సెంటర్ వరకు జాతీయ రహదారి గుండా ఈ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు.

కార్యక్రమంలో వీరవాసరం సర్పంచి చికిలే మంగతాయారు, నేతలు మానుకొండ ప్రదీప్‌కుమార్, పీతల సుబ్రహ్మణ్యం, నేతల జ్ఞానసుందరాజు, బొంతు రమేష్, పొలమూరి బిల్‌రాజు, చిక్కాల రాజు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద ఆందోళన

ప్రజాశక్తి - భీమవరం

విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, 45 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి ప్రకటించాలని, పీస్ రేట్ కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలని నినదించారు. ఈ సందర్భంగా ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ నాయకులు జె.శ్రీనివాస్, సంజయ్, కళ్యాణ్ మాట్లాడారు. ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రయివేటుపరం చేయడానికి కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కైందన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎంఆంజనేయులు, ఫాజిల్, రాంబాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో వినతి

భీమవరం రూరల్: ఆగస్టు 10వ తేదీలోగా తమ సమస్యలను పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెను చేపడతామని భీమవరం డివిజన్ విద్యుత్ శాఖ ఎడిఒ రాజగోపాల్ చౌదరి హెచ్చరించారు. రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు విద్యుత్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ భీమవరం అంబేద్కర్ సెంటర్లో వినూత్న నిరసన తెలిపారు. గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు సమస్యలతో కూడిన వినతిపత్రాలు అందజేశారు.

భీమవరంలో ధర్నా

తాడేపల్లిగూడెం: విద్యుత్ ఉద్యోగులు సోమవారం స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీ విద్యుత్ సబ్ డివిజన్ నుండి మున్సిపల్ ఆఫీస్ వద్ద గల గాంధీ మండపం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆర్‌టిసి బస్టాండు వద్ద మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, పోలీస్ స్టేషన్ వద్ద డాక్టర్ బిఆర్.అంబేద్కర్, గాంధీ మండపం వద్ద మహాత్మాగాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాలకు వినతిపత్రాలు అందించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ జెఎసి ఛైర్మన్ ఎస్.సీతారాములు, కన్వీనర్ కె.దానకొండలరావు, కోకన్వీనర్ ఎ.సతీష్, వైస్ ఛైర్మన్లు టి.గోవింద్, గంగరాజు, బాలాజీ, రామకృష్ణ పాల్గొన్నారు.

నినదిస్తున్న న్యాయవాదులు

దాడులను నిరసిస్తూ న్యాయవాదుల ఆందోళన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

న్యాయవాదులపై దాడులు చేసే వారిని తక్షణం అరెస్టు చేసి, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం ప్రత్యేక చట్టం విషయంలో వెంటనే స్పందించాలని కోరుతూ తాడేపల్లిగూడెం న్యాయవాదులు నల్లరిబ్బన్లు ధరించి కోర్టుకు హాజరయ్యారు. ఇటీవల విజయవాడలో న్యాయవాది విఠల్‌బాబు హత్యను ఖండిస్తూ సోమవారం తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డి, సెక్రటరీ దాసం సునీల్, న్యాయవాదులు డి.ఏకాంత, కృష్ణమోహన్, సోమేశ్వరరావు, తోట రాంబాబు, ముళ్లపూడి శ్రీనివాస్‌రావు, గోపాలరావు, ఆచార్యులు, కె.రామకృష్ణ, కొయ్య వెంకటేశ్వరరావు, వి.ఆదినారాయణ, డి.శ్రీనివాస్, భూపాల్, సౌదామిని, మహాలక్ష్మి, సత్యనారాయణమూర్తి, ఇజ్రాయిల్‌రాజు, బాబ్జీ, పేరేపి నరసన్న పాల్గొన్నారు.

ఉత్తరపాలెంలో ఉచిత వైద్య శిబిరం

సిపిఎం ప్రకటనకు స్పందన

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలోని ఉత్తరపాలెంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో గత కొన్ని రోజులుగా గ్రామస్తులు అనారోగ్యపాలవుతున్నారంటూ సిపిఎం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసిం. దీంతో వైద్యాధికారులు, పంచాయతీ పాలకవర్గాలు స్పందించి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో పారిశుధ్య మెరుగుదలకు పంచాయతీవారు చర్యలు తీసుకున్నారు. గ్రామమంతా బ్లీచింగ్ చల్లించారు. మురుగునీరు నిల్వ ఉన్న గుంతల్లో దోమల నిర్మూలనకు రసాయనాలు చల్లారు. వైద్యాధికారులు అవసరమైనవారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. సర్పంచి కోడి వరలక్ష్మి, కోడి అప్పారావు, వార్డు సభ్యులు గ్రామంలో నెలకొన్న పరిస్థితులను పర్యవేక్షించారు.

ఎన్నికల సామగ్రి భద్రపరిచే గోడౌన్ పరిశీలన

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల సామగ్రిని భద్రపరిచేందుకు ఎంపిక చేసిన స్థానిక రిలయన్స్ పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న సిడబ్ల్యుసి గోడౌన్‌ను జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. గోడౌన్ లోపల, బయట కొన్ని పనులు చేపట్టాల్సి ఉందని అధికారులకు సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా గోడౌన్‌లో అవసరమైన మార్పులు, చేర్పులను చేయాలని కలెక్టర్ గత సమావేశంలో సూచించారని తెలిపారు. పెయింటింగ్ పనులు కూడా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇవిఎంలు, వివి ప్యాడ్స్, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచేందుకు త్వరితగతిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. జెసితో పాటు పురపాలక సంఘం ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది, సిడబ్ల్యుసి గోడౌన్ అధికారులు, సర్వేయర్లు ఉన్నారు.

గోదాము పరిశీలన

నరసాపురం టౌన్ : నరసాపురం మండల స్థాయి గోదామును జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. నరసాపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్ గోడౌన్‌లో ఏర్పాటు చేసిన నరసాపురం మండల స్థాయి గోదాము వద్ద వర్షపు నీరు నిల్వ ఉండటాన్ని గుర్తించి గోదాము కేంద్రాన్ని మార్చేందుకు మరొక అనువైన ప్రాంతం చూడాలని అధికారులకు సూచించారు. వరద ముంపునకు గురైన కొత్త నవరసపురం, పాత నవరసపురం గ్రామాల్లో నిత్యావసర వస్తువుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. జెసితో పాటు నరసాపురం తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, డిప్యూటీ తహశీల్దార్ నాగదేవి పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ పరిశీలన

పాలకొల్లు : పాలకొల్లు మండల స్థాయి స్టాక్ పాయింట్‌ను జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. పాలకొల్లు మండల స్థాయి స్టాక్ పాయింట్‌లో గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం కిట్ల తయారీ విధానాన్ని జెసి పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు నిత్యావసర వస్తువులు సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రేషన్ బియ్యం స్టాక్ నిల్వలపై ఆరా తీశారు. రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు చురుకు గా జరపాలన్నారు. ఆయనతో పాటు తహశీల్దార్ సిహెచ్.పెద్దిరాజు, రాఘవులు ఉన్నారు.



ఏలూరుపాడులో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న పివిఎల్

సంక్షేమం, అభివృద్ధికే ప్రాధాన్యం

వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్

ప్రజాశక్తి - కాళ్ల

వైసిపి ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని డిసిసిబి ఛైర్మన్, ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని ఏలూరుపాడు గ్రామంలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైసిపి చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక టిడిపి నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాళ్ల జెడ్‌పిటిసి సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపిపిలు పెన్మత్స శిరీష విశ్వనాధరాజు, సర్పంచి భూపతిరాజు జగ్గరాజు, ఎంపిటిసి సభ్యులు చిన్నాపరపు రాంబాబు, వైసిపి నాయకులు మంతెన రామకృష్ణంరాజు, బండ్రెడ్డి ఆదియ్య, పడమటి సుబ్బయ్య, కొండా రమణ, కోనా రంజిత్, పడమటి సతీష్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఇద్దరు చోరులు అరెస్టు

ప్రజాశక్తి - పాలకొల్లు

జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.16 లక్షల విలువైన 34 కాసుల బంగారపు వస్తువులు, ఐదు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పాలకొల్లు లయన్స్ క్లబ్‌లో ఎస్‌పి యు.రవిప్రకాష్ సోమవారం మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. భీమవరం రాయిలంకు చెందిన అనుపోజు కృష్ణవంశీ, భీమవరం రూరల్ దేగాపురానికి చెందిన జువ్వల తరుణ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారు ఇటీవల పాలకొల్లు, భీమవరం, ఏలూరులో చోరీలకు పాల్పడినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.16 లక్షల విలువైన 34 కాసుల బంగారపు వస్తువులు, ఐదు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

జిల్లాలో 801 సెల్‌ఫోన్లు రికవరీ

జిల్లాలో ఇప్పటివరకు 801 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని బాధితులకు అందించినట్లు ఎస్‌పి చెప్పారు. ఇప్పటివరకు సెల్‌ఫోన్లు చోరీకి గురైనట్లు 2450 ఫిర్యాదులు వచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం పాలకొల్లులో 201 మంది బాధితులకు సెల్‌ఫోన్లు తిరిగి ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్‌పిలు మనోహర్, మురళీకృష్ణ, సిఐ డి.రాంబాబు, ఎస్ఐ బాదం శ్రీనివాస్, ముత్యాలరావు పాల్గొన్నారు.

పరస్పర ఫిర్యాదులపై కేసు

ప్రజాశక్తి - ఉండి

పాత కక్షల నేపథ్యంలో ఇరుగ్రూపుల మధ్య జరిగిన కొట్లాటలో ఒకరిపై మరొకరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండి కొండ్రోతుపేటలో వాలీబాల్ ఆడుతున్న కొమ్మన పవన్‌సాయిపై నాని మరో ఐదుగురు వ్యక్తులు క్రికెట్ బ్యాట్‌తో దాడి చేశారు. దాడిలో గాయాలపాలైన పవన్‌సాయి చికిత్స నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా ఆసుపత్రి సిబ్బంది చేసిన ఫిర్యాదు మేరకు ఉండి ఎస్ఐ కె.గంగాధరరావు కేసు నమోదు చేశారు. అదే గ్రామానికి చెందిన హేమంత్ తనపై పవన్‌సాయి పాత కక్షలు నేపథ్యంలో దాడి చేసి గాయపరిచాడ నిఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాట స్థావరాలపై దాడి

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని ఉండి, కలిసిపూడి గ్రామాల్లో పేకాట స్థావరాలపై ఉండి పోలీసులు దాడి చేశారు. మండలంలోని కలిసిపూడిలో పేకాటస్థావరంపై దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.10,430 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఉండి రైల్వే స్టేషన్ సమీపంలో పేకాటస్థావరంపై దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.9150 నగదును స్వాధీనం చేసుకున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

లంక గ్రామాల్లో 12 పునరావాస కేంద్రాలు

ప్రజాశక్తి - ఆచంట

లంక గ్రామాల్లో 12 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మండలంలోని పెదమల్లంలంక, అనగారలంక ముంపు గ్రామాల్లో ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రాల్లో వంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లంక గ్రామాల్లో ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా అన్ని విధాలుగా అదుకుంటామన్నారు. అయోధ్యలంక, పెదమల్లం అనగారలంక ప్రతి ఏరియాల్లో భోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేటి నుంచి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఛైర్మన్ లావణ్య, సర్పంచులు దిరిశాల విజయలక్ష్మి, సుంకర సీతారాం, జక్కంశెట్టి చంటి, నాయకులు కోట వెంకటేశ్వరరావు, పాలకొల్లు ఎంపిడిఒ సంగాని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ షేక్ హుస్సేన్

భూ రీసర్వే అభినందనీయం

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వైఎస్ఆర్ జగనన్న భూ హక్కు, భూ రక్ష రీ సర్వే చేపట్టడం అభినందనీయమని పాలకోడేరు ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు) అన్నారు. రీ సర్వే పూర్తయిన వేంద్ర, పాలకోడేరు గ్రామాల్లో సచివాలయం వద్ద సోమవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చంటిరాజు మాట్లాడుతూ ప్రతి పదేళ్లకోసారి భూమిని రీ సర్వే చేయాల్సి ఉందని, గత ప్రభుత్వాలు దీనిని పట్టించుకోలేదని చెప్పారు. తహశీల్దార్ షేక్ హుస్సేన్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కడలి నాగేశ్వరి, ఇంజేటి మరియమ్మ, ఉప సర్పంచులు భూపతిరాజు సుబ్బరాజు, దెందుకూరి వెంకటరాజు, ఎంపిటిసి సభ్యులు పాల జ్యోతి, మండల సర్వేయర్ శ్రీనివాస్, విలేజ్ సర్వేయర్ స్వామి, విఆర్ఒలు అలేఖ్య, పంచాయతీ కార్యదర్శి పోలయ్య, రామాలీల పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు బదిలీలు, ఉద్యోగోన్నతులు నిర్వహించి 50 రోజులు గడుస్తున్నప్పటికీ వారికి జీతాలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల జీతాల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆందోళన వ్యక్తపరిచారు. ఉపాధ్యాయులు చేయని నేరానికి వారిని అదేపనిగా శిక్షలకు గురిచేస్తూ సస్పెండ్ చేస్తున్న ప్రభుత్వ అధికారులు రెండు నెలలుగా ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించడంలో ఎందుకు శ్రద్ధ చూపడంలేదని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారన్నారు. ఉపాధ్యాయ వృత్తిని బోధన, ఉపాధ్యాయుడు, విద్యార్థి, తల్లిదండ్రులు, సమాజము ఈ అంశాల మధ్య ఉంటే సున్నిత వ్యవహారంగా ప్రభుత్వం భావించడం లేదని, ఉపాధ్యాయులపై తీవ్రమైన పనిభారం మోపుతుందని చెప్పారు.

'అవినీతి జరిగినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం'

ప్రజాశక్తి - ఆకివీడు

నగర పంచాయతీకి చెందిన మంచినీటి వాటర్ ట్యాంక్ ఫిల్టర్ల వద్ద ఇసుక అక్రమ రవాణా జరిగిందంటూ ఆరోపించేవారెవారైనా ఒక్క రూపాయి అవినీతి జరిగినట్లు చూపితే ఏ శిక్షకైనా తాను సిద్ధమని వైస్ ఛైర్మన్ పుప్పాల సత్యనారాయణ (పండు) అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన పంచాయతీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో నగర పంచాయతీకి చెందిన వాటర్ ట్యాంక్ వద్ద ఇసుక అక్రమ రవాణా జరిగిందంటూ కొందరు సభ్యులు చెప్పారు. ఈ సందర్భంగా కౌన్సిల్ వైస్ ఛైర్మన్ పుప్పాల సత్యనారాయణ (పండు) మాట్లాడుతూ ఇసుకను పాలకవర్గ అధ్యక్షురాలి అనుమతితో తానే వినియోగించానన్నారు. కనీసం నడిచేందుకు అవకాశం లేని గోతులు ఉన్న ప్రాంతాల్లో పోసి పైన మట్టి వేశామని చెప్పారు. అవినీతి జరిగినట్లు ఎవరైనా రుజువు చేయగలిగితే తాను ఏ శిక్షకైనా సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

వైసిపిది అరాచక పాలన : టిడిపి

ప్రజాశక్తి - ఉండి

వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు అన్నారు. మండలంలోని వెలివర్రు గ్రామంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు వత్సవాయి సుజాత ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మహిళా శక్తి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి టిడిపి అధికారంలోకి వస్తే చేకూరే లబ్ధిని వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ నిత్యావసరాల సరుకుల ధరలను అదుపు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కన్నెగంటి రూత్‌కళ, నాగ వెంకటలక్ష్మి, వేగేశ్న అనంతలక్ష్మి, పద్మ, పార్టీ వెలివర్రు గ్రామ అధ్యక్షులు సిద్ధరాజు, టిడిపి సీనియర్ నాయకులు జుత్తిగ శ్రీనివాస్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు, మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు 22, 23వ వార్డుల్లో మహిళా శక్తి కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కర్నేన రోజారమణి, జివి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

స్పందనలో మోగల్లు గ్రామస్తుల ఫిర్యాదు

ప్రజాశక్తి - పాలకోడేరు

అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న మోగల్లు పంచాయతీ కార్యదర్శి కె.వెంకటరాజుపై తక్షణం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు స్పందనలో సోమవారం ఫిర్యాదు చేశారు. మోగల్లు పంచాయతీలో జరిగిన అవినీతి, అక్రమాలపై మార్చి 25వ తేదీన ఎంపిడిఒకు వినతిపత్రం అందించినట్లు చెప్పారు. దీనిలో భాగంగా ఇఒపిఆర్‌డి ఏప్రిల్ 11న విచారణ చేపట్టారు. ఈ విచారణలో పంచాయతీ కార్యదర్శి పంచాయితీ సొమ్మును సొంత ఖాతా ద్వారా లావాదేవీలు చేసినట్లు అధికారులు తేల్చినట్లు తెలిపారు. ఈ నివేదికను అందుకున్న ఎంపిడిఒ మే 26న డిపిఒకు అందించారన్నారు. ఇదంతా జరిగి సుమారు నాలుగు నెలలు కావస్తున్నా సంబంధిత పంచాయతీ కార్యదర్శిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఫిర్యాదులో తెలిపారు. పంచాయతీ కార్యదర్శిపై తక్షణం చట్టపరమైన చర్యలు తీసుకుని ఆయన సొంత ఖాతాలో జమ చేసుకున్న సొమ్మును రికవరీ చేయాలని గ్రామస్తులు పి.వెంకటరాజు, చిట్టిబాబు, వెంకటస్వామి, నాగేశ్వరరావు, రాజు కోరారు.

వీడని నక్కల డ్రెయిన్ ముంపు

రహదారిపై నిలిచిన నీరు
రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

విద్యార్థులను ట్రాక్టర్‌లో నీటిని దాటిస్తున్న సర్పంచి

ప్రజాశక్తి - పోడూరు

వరద ప్రభావానికి మండలంలోని వద్దిపర్రు గ్రామంలో నక్కల డ్రెయిన్ పొంగి రోడ్డు మీదకు నీరు చేరి నాలుగు రోజుల నుంచి అలానే కొనసాగుతుంది. దీంతో వల్లూరు నుంచి పాలకొల్లు వైపు వెళ్లే వద్దిపర్రు, వల్లూరు పంచాయతీ పరిధిలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్కూల్‌కి వెళ్లే పిల్లల కోసం సర్పంచి వడ్లపాటి రాజేంద్రప్రసాద్ సొంత ఖర్చులతో ట్రాక్టర్‌పై వరద నీరు నుంచి దాటిస్తున్నారు. పంట పొలాలు, ఆకుమడులు పూర్తిగా నాలుగు రోజుల నుంచి నీటిలోనే మునిగి ఉన్నాయి. ప్రతి ఏడాది వర్షాకాలంలో నక్కల డ్రెయిన్ పొంగి రోడ్డు మీదకు, కాలనీలోకి నీరు చేరుతుంది. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలుమార్లు అధికారులకు, రాజకీయ నాయకులకు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు ముక్తకంఠంతో కోరుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

వడ్లపాటి రాజేంద్రప్రసాద్, సర్పంచి, వద్దిపర్రు

ప్రతి ఏడాది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు పట్టించుకోవడంలేదు. వరదలు తగ్గుముఖం పట్టిన తర్వాత దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

వరద తాకిడి గ్రామాల్లో పారిశుధ్య పనులు

కలెక్టర్ ప్రశాంతి

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

వరద తాకిడికి గురైన ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఆర్‌డిఒ, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలతో సమావేశమై పలు అంశాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వరద తాకిడి మంగళవారం నాటికి పూర్తిగా తొలగిపోయే అవకాశం ఉందని, మెడికల్ క్యాంపులను రెండు రోజులపాటు కొనసాగించాలని చెప్పారు. పశు దాణాను పంపిణీ చేయాలని పశుసంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు.

యలమంచిలి, ఆచంట, నరసాపురంలలో 23 లోతట్టు గ్రామాలు ముంపునకు గురయ్యాయన్నారు. 11 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, 25 మెడికల్ క్యాంపులను నిర్వహించినట్లు తెలిపారు. నిత్యావసర వస్తువులను పంపిణీ చేశామన్నారు. అగ్నిమాపక శాఖ నుంచి ఐదు టీములను, 40 లైఫ్‌జాకెట్స్‌ను సిద్ధం చేసినట్లు తెలిపారు. 15 ఇంజిన్ బోట్లను, ఎనిమిది కంట్రీ బోట్లను మొత్తం 23 బోట్లను సిద్ధం చేశామన్నారు.

పెండింగ్‌లో వన్ టైం సెటిల్‌మెంట్ పత్రాలు

పెండింగ్‌లో ఉన్న వన్ టైం సెటిల్‌మెంట్ పత్రాల రిజిస్ట్రేషన్ పనులు పూర్తి చేయాలన్నారు. సిసిఆర్‌సి కార్డులు జారీలో భీమవరం, అత్తిలి, తాడేపల్లి మండలాలు నూరుశాతం జారీ పూర్తి చేసినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

గొరగనమూడి సర్పంచి శివాజీరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గొరగనముడి సర్పంచి గొట్టుముక్కల వెంకట శివరామరాజు (శివాజీరాజు) అన్నారు. గొరగనమూడి స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.69 లక్షలతో జరుగుతున్న నాడు-నేడు పనులను పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ పొన్నమండ బాలకృష్ణతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచి శివాజీరాజు మాటాడుతూ నాడు-నేడుతో పాఠశాలలను ప్రభుత్వం అభి. వృద్ధి చేస్తుందన్నారు. తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ బాలకృష్ణ మాట్లాడుతూ వైసిపి అధికారం చేపట్టాక పాఠశాలలు, విద్యపై ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి ఉన్నారు.

నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న సర్పంచి శివాజీరాజు

అమ్మఒడి ప్రేమబడి పుస్తకావిష్కరణ

పుస్తకం ఆవిష్కరిస్తున్న వక్తలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఎమ్మిగనూరుకు చెందిన ప్రముఖ గేయకవి గద్వాల్ సోమన్న రచించిన అమ్మఒడి ప్రేమ బడి పుస్తకావిష్కరణ సోమవారం సాయంత్రం అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించారు. పుస్తకాన్ని సభాధ్యక్షుడు గురుసహస్రావధాని డాక్టర్ కడిమెళ్ల వరప్రసాద్ ఆవిష్కరించారు. అనంతరం గద్వాల్ సోమన్న చేతుల మీదుగా పెన్మెత్స సత్యనారాయణరాజు (బాబు శ్రీ)కి అంకితమిచ్చారు.

అల్లూరి సోమరాజు "ఆత్మకథ" ఆవిష్కరణ

మాజీ ఎంపీ, కీర్తిశేషులు అల్లూరి సత్యనారాయణరాజు రెండో కుమారుడు డాక్టర్ సోమరాజు రచించిన "నా జీవనయానం (ఆత్మకథ)"ను డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, షేక్ సిలార్ సాహెబ్ సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ పుస్తకాల ఆవిష్కరణ సభకు వ్యాఖ్యాతగా రెడ్డప్ప ధవేజీ వ్యవహరించారు. కవులు మంకు శ్రీను, గాదిరాజు రంగరాజు, ప్రముఖులు నెక్కంటి సుబ్బారావు, తోలేటి పార్థసారథి, పెద్దింటి దత్తాత్రేయ దీక్షితులు, భట్టిప్రోలు సత్యనారాయణ పాల్గొన్నారు.

'జనసేనను అధికారంలోకి తీసుకురావాలి'

ప్రజాశక్తి - కాళ్ల

వచ్చే సాధారణ ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి స్వస్తి చెప్పి జనసేనను అధికారంలోకి తీసుకురావాలని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గవరలక్ష్మి, పార్టీ నియోజకవర్గ నాయకుడు నాగరాజు అన్నారు. మండలంలోని సీసలి గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎరుబండి రామాంజనేయులు ఆధ్వర్యంలో 'జనంలోకి జనసేన' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సీసలి గ్రామంలో పర్యటిస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందాలన్నా, సుభిక్షంగా ఉండాలన్నా, యువత భవిష్యత్తు బంగారు కావాలన్నా వచ్చే సాధారణ ఎన్నికల్లో జనసేనను ఆదరించాలని కోరారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, గృహిణులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతులకు లాభసాటి వ్యవసాయం వంటివి జనసేన మేనిఫెస్టోలో ప్రధాన అంశాలన్నారు. అనంతరం గ్రామంలో పలువురు పేదలకు నిత్యావసర వస్తువులను అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు నూకల భోగేంద్రబాబు, పిఎసి సభ్యుడు తోట వాసు, నాయకులు గాదం నానాజీ, గడి రాము, ఆరేటి దిలీప్, మోటూరి కృష్ణ, బండారు సోమేశ్వరరావు పాల్గొన్నారు.

రాజకీయ ఒత్తిళ్లకు లొంగుతున్న అధికారులు

మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ప్రభుత్వ అధికారులు రాజకీయ ఒత్తిడులకు లొంగకుండా ప్రజల కోసం పనిచేస్తేనే వారికి వృత్తికి గుర్తింపు ఉంటుందని మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు అన్నారు. మున్సిపల్ కమిషనర్, పోలీసులు, అధికారులు బండారు మాధవనాయుడుపై దౌర్జన్యంగా వ్యవహరించిన తీరుకు నిరసనగా నరసాపురం పట్టణంలో సోమవారం అన్ని వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూసివేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ మాధవనాయుడు టిడిపి కుటుంబసభ్యులతో, ప్రజలతో కలిసి పట్టణంలో రాయిపేట కార్యాలయం నుంచి గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు శాంతియుతంగా భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో హత్యలు, అరాచకాలు, దోపిడీలు పెరిగిపోయాయన్నారు. ఎంఎల్ఎ ప్రసాదరాజు, మున్సిపల్ అధికారులు పట్టణంలో వ్యాపారులపై కక్ష సాధింపుగా వ్యవహరిస్తున్నారన్నారు. అన్యాయం జరిగితే ఎదిరించినప్పుడే వ్యవస్థలో మార్పు వస్తుందన్నారు. నియోజకవర్గంలో ప్రజలు, వ్యాపారుల సమస్య పరిష్కారం కోసం ఎంతవరకైనా వెళ్తానన్నారు. అక్రమంగా షాపులు కొట్టటం, తనపై పోలీసులు వ్యవహరించిన తీరుపై స్వచ్ఛందంగా బంద్‌కు పిలుపునిచ్చి తనకు సంఘీభావం తెలిపిన పట్టణంలో అన్ని వ్యాపార సంస్థల యజమానులకు, సంఘీభావం తెలుపుతూ స్వయంగా కలిసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిటికెల రామ్మోహనరావు, అండ్రాజు రామన్న, రేవు ప్రభుదాస్, కడలి మోహనరావు, చాగంటి బ్రదర్స్, గన్నవరపు శ్రీనివాస్, చెంపాటి సత్యనారాయణరాజు, సత్తినేని త్రిమూర్తులు, మాంద్రు హేమలత, చల్లా పద్మావతి, గాడి శివ గౌరి, నడిపూడి కృష్ణ, కొండేటి శ్రీను, బస్వాని ఏడుకొండలు, తిరుమాని తాతయ్య, పులపర్తి దత్తు యూత్, పులపర్తి సతీష్, శ్రీధర్, పోలిశెట్టి సాంబ, బందెల రవీంద్ర, నడిపూడి శ్రీను, వెలిది ముక్తేశ్వరరావు, కొల్లటి హరి, కవురు రంగ, అడిదెల డానియల్, మొసుగంటి శేఖర్, గుబ్బల మహేష్, ఆరవ రాంబాబు, గంధం తేజ పాల్గొన్నారు.

సమాజ సేవే లయన్స్ క్లబ్ ధ్యేయం

ప్రజాశక్తి - ఉండి

సేవే పరమార్థంగా లయన్స్ క్లబ్ పలు సేవలందిస్తుందని పలువురు వక్తలు అన్నారు. ఉండి భవిత కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్ కూనపరాజు రామరాజు ఆర్థిక సహకారంతో విద్యార్థులకు కంచాలు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు క్లబ్ అధ్యక్షురాలు లయన్ వేగేశ్న అనంతలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జోన్-2 మండల విద్యాశాఖాధికారి బి.వినాయకుడు మాట్లాడుతూ వికలాంగులకు అవసరమైనవి సమాకుర్చటం అభినందనీయన్నారు. క్లబ్ కార్యదర్శి లయన్ రూత్‌కళ మాట్లాడుతూ త్వరలో ఒక ఐరన్ బీరువా అందిస్తామన్నారు. క్లబ్ వైస్ ప్రసిడెంట్ లయన్ గాదిరాజు రంగరాజు మాట్లాడుతూ సేవలోనే లయనిజం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ రుద్రరాజు నరసరాజు, లయన్ కాగిత మహంకాళి, క్లబ్ వైస్ ప్రెసిడెంట్ లయన్ సత్తి బ్రహ్మారెడ్డి, లయన్ పెన్మెత్స రంగప్రసాద్‌రాజు, ఎస్‌విఎస్ఎల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేషయ్య, భవిత ఉపాధ్యాయుడు జి.రవి పాల్గొన్నారు.

ఎఎన్ఎంలకు ఇంక్రిమెంట్ పత్రాలు

ప్రజాశక్తి - ఉండి

ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఎఎన్ఎంలకు ఈ ఏడాది పెంచే ఇంక్రిమెంట్ పత్రాలను ఎఎన్ఎంలకు ఎంపిపి, పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు సోమవారం అందించారు. ఈ సందర్భంగా నారాయణరాజు మాట్లాడుతూ వైసిపి వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఎఎన్ఎంలకు పెంచిన ఇంక్రిమెంట్ల ద్వారా వారికి ఆర్థిక భరోసా ఇచ్చినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పి.ధర్మతేజ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తరణ అధికారి ఆర్.కృష్ణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి నేతల ధర్నా

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పట్టణంలోని 31వ వార్డు మురుగు కాలువను టిడిపి నరసాపురం నియోజవర్గ ఇన్‌ఛార్జి పి.రామరాజు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కాలువలోని నీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తుందని ఈ సమస్యను తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. నవరసాపురంలోని అవుట్ లూయిస్ తలుపులకు మరమ్మతులు చేయకపోవడం వల్ల వరద ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. అక్కడ రైతులతో వంతెనపై ధర్నా నిర్వహించారు. పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, రామరాజు రోడ్డుపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, టిడిపి నేతలు పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహనా ర్యాలీ

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద డెంగీ వ్యాధి నివారణ మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ డెంగీ వ్యాధి వచ్చినవారికి విపరీతమైన జ్వరం, తలనొప్పి, వికారం, రక్త కణాలు తగ్గటం, ఒంటి మీద దద్దుర్లు ఏర్పడడం, కళ్లు ఎర్రబడడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వ్యాధి తీవ్ర దశలో రక్తనాళాలు చిట్లిపోవడం వల్ల కళ్ల నుంచి రక్తం కారడం, పంటి చిగురు నుంచి రక్తం కారుట, విరోచనం ద్వారా రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. సబ్ యూనిట్ అధికారి కె.రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఎవరికైనా డెంగీ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకుంటే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.నవ్యజీవన్, సబ్ యూనిట్ అధికారి రాజ్‌కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారులు గుడాల హరిబాబు, కె.ప్రభాకర్, పిహెచ్ఎన్ పి.ఎలిజిబెత్, ప్రధానోపాధ్యాయులు జిబిజె.ప్రసాదరావు, పి.భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్ బాలచంద్రుడు, కమల, ఎంఎల్‌హెచ్‌పి మార్తమ్మ, హెల్త్ అసిస్టెంట్లు దివాకర్‌బాబు, తారకసత్య, గోపాలకృష్ణ, ప్రసాద్, ఎఎన్ఎంలు రోజా కమల, ఆదిలక్ష్మి, ఆశాలు వెంకటలక్ష్మి, శ్యామల, విజయ కుమారి పాల్గొన్నారు.

CHANGE OF NAME

We, **JOHANNAS PREMKUMAR MALLIPUDI AND SHANTHI JOHANNAS MALLIPUDI PARENTS of MARY JIANA MALLIPUDI** resident of 29-111, Near S.A.L.T. Church, Velpur Road, TANUKU 534 211 have changed her name from **MARY JIANA MALLIPUDI (old name) to MARIE JIANA MALLIPUDI (new name).** Hence, after all her documents (Passport, Aadhar, etc.,) and all correspondence will continue with her New Name **MARIE JIANA MALLIPUDI.**

ప్రకటన
మహారాజశ్రీ తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఒ.యస్.నెం.246/2015

బిట్వీన్
ద్రోణంరాజు సదాశివరావు ...వాది
మరియు
పరసా కమల, వైఫ్ ఆఫ్ నారాయణరావు, హిందువు, వయస్సు 59 సం॥లు, గృహిణి, జంగారెడ్డిగూడెం పోస్ట్ అండ్ మండలం, ప్రస్తుతం ఏలూరు జిల్లా, వగైరాలు ...ప్రతివాదులు

పై నెంబరు దావాలో వాది, పరసా నారాయణరావు మొదటి తరగతి వారసులపై దావా దాఖలు చేయగా 1వ ప్రతివాదికి శ్రీ కోర్టువారి ద్వారా పంపిన దావా సమన్లు అమలు జరగటంలేదు. అందువల్ల 1వ ప్రతివాది హాజరు కొరకు పబ్లికేషన్ ఆర్డరు శ్రీ కోర్టు వారు దయచేయించియున్నారు. కావున ఈ ప్రకటన ద్వారా పరసా కమల వైఫ్ ఆఫ్ నారాయణరావు, జంగారెడ్డిగూడెం పోస్ట్ అండ్ మండలం, ప్రస్తుతం ఏలూరు జిల్లా వారు ది.04-08-2023వ తేదీన ఉదయం 10-30 గంటలకు స్వయముగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ పై కోర్టు వారి యెదుట హాజరై వారి ఆక్షేపణలు తెలియ జేయగలరని, లేనిచో వారి పరోక్షములో దావా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

తిరువూరు,
ది.31-07-2023

ఇట్లు
ఆర్.మోహనరెడ్డి,
వాది తరపు న్యాయవాది, తిరువూరు.